క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లింగాల : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగోవ విడత అడ్మిషన్లకు పదవ తరగతి పూర్తైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 27వ తేదీలోపు ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు స్థానిక ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 29వ తేదీన అడ్మిషన్లకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

ఇ-క్రాప్ చేయించుకోండి

సింహాద్రిపురం : సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ చేయించుకోవాలని ముద్దనూరు హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. గురువారం రావులకొలను, అహోబిలం గ్రామాల్లో ఉల్లి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఉల్లికి గిట్టుబాటు ధర సరిగా లేకపోవడంతో రైతు ఉల్లి పంటను గ్రామ ప్రజలకు ఉచితంగా ఇచ్చారని, అలాగే ధర లేకపోవడంతో మిగతా పంటను రోడ్డు పక్కన వేయడం జరిగిందని, ఉల్లి పంటను ఇ-పంటలో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్, ప్రత్యామ్నాయ ప్రోత్సాహకాలు వర్తిస్తాయన్నారు.

పంటల పరిశీలన

ముద్దనూరు : నకిలీ విత్తనాలతో సాగుచేసి నష్టపోయిన రైతుల ఫిర్యాదు మేరకు సాగులో వున్న మొక్కజొన్న పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. మండలంలోని శెట్టివారిపల్లెకు చెందిన రైతులు తాడిపత్రిలోని ఓ దుకాణం నుంచి సాహో 007 రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలుచేసి సాగు చేశారు. అవి నకిలీ విత్తనాలని, పంట దిగుబడి, నాణ్యత లేదని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మొక్కజొన్న సాగును పరిశీలించి రైతులనుంచి వివరాలు సేకరించారు.

విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసుకోవాలి

వేంపల్లె : విద్యార్థులు సాంకేతిక విద్యాపరమైన సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఇంట్రాక్టివ్ స్పెషల్ విభాగాధిపతి డాక్టర్ చల్లారత్నకుమారి తెలిపారు. గురువారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలోని విద్యార్థులకు ×హౌ టు క్రాక్ యువర్ ఫస్ట్ జాబ్∗ అనే అంశంపై ఇంట్రాక్టివ్ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మోటివేట్ చేయడానికి రిసోర్స్ పర్సన్ జానీబాషా విచ్చేశారు. అతను చదువుకుంటూ స్టార్ట్ కంపెనీ మొదలుపెట్టి అంచలంచెలుగా ఎదిగి రూ.3 కోట్ల టర్నోవర్ చేస్తున్నాడు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకాడమిక్ రమేష్ కైలాష్ హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

ఎర్రగుంట్ల : థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చౌటిపల్లి రామగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీపీపీ సీఈ చాంబర్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు వినతిపత్రం అందించారు.

మేళాను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక కల్యాణం మేళాను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సీఎంఎం నాగలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో నిర్వహించిన మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ మేళా ద్వారా వీధి విక్రయదారులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారికి రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేల రుణాలు ఇస్తారన్నారు. గతంలో రూ.10వేలు తీసుకున్న వారికి రూ.20వేలు, రూ.20వేలు తీసుకున్న వారికి రూ.50వేలు ఇస్తారన్నారు. కొత్త వారు ఎవరైనా మేళా ద్వారా పీఎం అర్హులైన వారందరికీ వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇస్తారన్నారు. అవకాశాన్ని చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు జాబ్ మేళా

జమ్మలమడుగు : పట్టణంలోని సాయి పరమేశ్వర డిగ్రీకాలేజి ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజి కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. ఇందులో 12 కంపెనీలు పాల్గొంటాయన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత నుంచి డిగ్రీ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ కార్మికులు ఆరోగ్య విషయంలో తప్పకుండా జగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. గురువారం అర్బన్ హెల్త్ కేంద్రం పరిధిలో స్వచ్ఛతా హి సేవ-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అర్బన్ హెల్త్ కేంద్రం వైద్యాధికారి డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

ఎటు చూసినా నీరే..

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- స్థంభించిన రాక పోకలు

కమలాపురం : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లాయి. కమలాపురంలో 76.2 మి. మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో వెంకటసుబ్బారెడ్డికి చెందిన ఇంటి పక్కనే పిడుగు పడటంతో ఇంటి పై భాగంలో గోడ కొద్దిగా దెబ్బతింది. దీంతో ఇంటి యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. కమలాపురం-ఖాజీపేట రహదారిలో ఉన్న పాగేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్థంబించి పోయాయి. సి.గోపులాపురం గ్రామానికి రెండు వైపుల వంకలు రావడంతో గ్రామస్తులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. లేటపల్లె, పొడదుర్తి, చదిపిరాళ్ల, సంబటూరు,ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి తదితర గ్రామాల్లోని పొలాల్లో నీరు నిలవడంతో పంటలన్నీ నీట మునిగాయి. మరి కొన్ని గ్రామాల్లో చేతికొచ్చిన పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని రోడ్లు జలమయం కాగ, ఇళ్లలోకి నీరు చేరింది. కంది, పత్తి , వరి పంటలన్నీ జలమయమైయ్యాయి. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జలమయమైయ్యాయి. తిప్పలూరు, సున్నపురాళ్లపల్లి, కలమల్ల, మాలెపాడు, పి.వెంకటాపురం, పోట్లదుర్తి, వై.కోడూరు, వలసపల్లి గ్రామాలలో వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరుల మధ్య రోడ్డుపైన నీరు చేరండంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది.



ఎర్రగుంట్ల : సుందరయ్యకాలనీలో ఇంటిలోకి చేరిన వర్షం నీరు

పులివెందులలో

పులివెందుల రూరల్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ముందర ఉన్న దుకాణాల ముందర వర్షం నీరు చేరడంతో ప్రజలు దుకాణాలకు ఎలా వస్తారని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దుకాణాల ముందు నీరు నిల్వ లేకుండా, విష పురుగులు రాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని దుకాణదారులు కోరుతున్నారు.



కమలాపురం : చదిపిరాళ్ల వద్ద పంట పొలాల్లో నిలిచిన వరద నీరు

నేలకొరిగిన విద్యుత్‌స్తంభం

ముద్దనూరు : స్థానిక ఎల్‌ఎం కాంపౌండ్‌లో గురువారం తెల్లవారుజామున ప్రభుత్వ పాఠశాల సమీపంలోని విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఈ ప్రమాదంలో విద్యుత్ తీగలు పాఠశాల ప్రాంగణంలో పడిపోయాయి. జోరు వర్షం కురయడంతో విద్యుత్‌స్తంభం కూలినట్లు స్థానికులు తెలిపారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాడిగొట్ల, బయనపల్లె, దౌలతపురం వంకలు ప్రవహించాయి.

వల్లూరులో..

వల్లూరు : మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన బారీ వర్షానికి పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంట నేలకొరిగింది. మండలంలో 76.8 ఎం.ఎం. వర్షం కురవడంతో వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. పెద్దపుత్త, కోట్లూరు తదితర గ్రామాల పరిధిలో రైతులు ముందస్తుగా సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోత దశలో వుండి వర్షం ధాటికి నేలకొరిగింది. 50 ఎకరాల వరకు వరి పంట నేలకొరిగినట్లు తెలుస్తోంది. పైడికాలువ వద్ద ఉన్న కల్వర్టుపై పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొప్పోలు చెరువుకు ఈ వంక నీటిని మళ్లించడంతో పెద్దపుత్త సమీపంలో వున్న చెరువు పొంగి ప్రవహించింది.



నడిపూరులో ఇంటిలోకి నీరు చేరి నీటిమయం అయిన రంగుల బస్తాలు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలో భారీ వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. కుంటలు, కోనాయపల్లె చెరువు జలకళలను సంతరించుకున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. మమ్ముసిద్దుపల్లె, పాతసంగటిపల్లె గ్రామాల వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిచడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోనాయపల్లె, ఏరాసుపల్లె గ్రామాల మధ్యలో ఇటీవల రహదారికి ఏర్పాటు చేసి బ్రిడ్జి వాగు నీరు వేళ్లెలా క్రమ పద్ధతిలో కాకుండా అధికారులు, కాంట్రాక్టర్ ఇష్టానుసారం కట్టడం వల్లన వాగు నీరు గ్రామంలోకి వచ్చిందని గ్రామస్థులు అవేదన వ్యక్తం చేశారు.



పులివెందుల : వ్యాపార దుకాణాల వద్ద నిల్వ ఉన్న వర్షపు నీరు



పైడికాలువ వద్ద కల్వర్టుపైన పొంగి ప్రవహిస్తున్న వంక



ముద్దనూరులో స్తంభం నేలకొరిగి ప్రహరీగోడపై పడిన విద్యుత్ తీగలు



తిప్పలూరు గ్రామంలో వర్షం దాటికి పడిపోయిన మసీద్ ప్రహరీ



పెండ్లిమర్రి : మమ్ముసిద్దుపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

లోఓల్టేజ్ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : అవసరమైన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్‌ఈ ఎస్.రమణ తెలిపారు. గురువారం చక్రాయపేట మండలంలోని యర్రగుడిలో ఉన్న 33/11కె.వి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. గృహ వినియోగదారులు ఉచిత విద్యుత్ పొందడానికి ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద గృహాలకు సోలార్ రూట్ టాప్ ఏర్పాటుపై అతి తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులో రుణాలు ఇస్తున్నాయన్నారు. సుమారు రూ.98 వేల వరకు సబ్సిడీ ప్రోత్సాహకాలను అందిస్తుందని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పురోగతిని పెంచాలన్నారు. విద్యుత్ లైన్లలో ముందస్తు సమస్యలను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్‌రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎస్.రమణ

అర్టీపీపీలో నాలుగో రోజుకు చేరిన నిరసన

ఎర్రగుంట్ల : ఏపీజెన్‌కో యజమాన్యం మొండి వైఖరి వీడి ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని జేఏసీ హెచ్చరించింది. గురువారం ఆర్టీపీపీలోని ప్రధాన గేటు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న ధర్నా నాలుగో రోజుకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 22వ తేదీ నుంచి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు.

28 పోలింగ్ కేంద్రాలు పెంపు

కమలాపురం : నియోజకవర్గ కేంద్రంలో 1200 ఓట్లకు పైగా ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేయడంతో 28 పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయని ఈఆర్‌ఓ నీలమయ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలాల్లో పెరిగిన కేంద్రాలను ఎక్కడ ఏర్పాటు చేయనున్నారో తహసీల్దార్ శివరామిరెడ్డి చదివి వినిపించారు. కమలాపురం మండలంలో 3, చెన్నూరులో 2, వల్లూరులో 2, వీఎన్‌పల్లె, పెండ్లిమర్రిలో 4 చొప్పున, సీకేదిన్నెలో 13 పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్లకు పైగా ఉన్నాయని, వీటిని రేషనలైజేషన్ చేయడంతో నియోజకవర్గంలో 28 పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయని ఆయన వివరించారు. ఇందులో 17 పోలింగ్ కేంద్రాలను అవే ఆవరణలో 11 కేంద్రాలను మాత్రం వేరే చోట ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2 కి.మీ. లోపే అందుబాటులో ఉండే విధంగా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై రాజకీయ నాయకుల సూచనలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అనంతరం ఈసీ దృష్టికి తీసుకెళ్లి ఓటరు జాబితా సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పీఏ నరసింహారెడ్డి, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలి

లింగాల : గర్భిణులు చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. గురువారం ఇప్పట్ల గ్రామ సచివాలయంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడవ నెల బిడ్డకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : ప్రతి ఒక్కరూ పోషకాహారం గురించి అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా తెలిపారు. గురువారం మండలంలోని ఇనగలూరు గ్రామ ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గంగయ్య, మండల ప్రాదేశిక సభ్యులు దశరథరామిరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని తంగేడుపల్లె సబ్ సెంటర్‌లో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్, 8వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో మండల వైద్యాధికారి మహమ్మద్ తాహ గర్భిణులు, వృద్దులు, పిల్లలకు వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. సర్పంచ్ స్వర్ణలత, సిహెచ్‌ఒ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ యోగేశ్వరయ్య పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : సున్నపురాళ్లపల్లెలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె ఓబులమ్మ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ టీ వరలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ టీ సుభద్రలు పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియంతో పథకాలు

ఎర్రగుంట్ల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలు తక్కువ ప్రీమియంతోనే ఎస్‌బీఐలో అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ రామారావు తెలిపారు. గురువారం తుమ్మలపల్లిలో జన సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ.436 చెల్లించి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకం వల్ల రెండు లక్షల జీవిత బీమా వర్తిస్తుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు లోపు నమోదు చేసుకోవచ్చన్నారు.

జక్కంపూడి రాజాను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం పెనుగొండ నియోజకవర్గానికి వెళుతున్న ఆయనను పులివెందులలో కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు అధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్న జక్కంపూడి రాజాను సత్కరించారు. కార్యక్రమంలో నూర్ బాషా రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్‌సీపీ లింగాల మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పెను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అత్యధిక వర్షపాతం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు డివిజన్‌లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. డివిజన్‌లో అత్యధికంగా ఎర్రగుంట్ల మండలంలో 132.2 మీ.మీ, అత్యల్పంగా కొండాపురంలో 3.8 మీమీ, ప్రొద్దుటూరులో 120.2 మీ.మీ వర్షం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మైలవరం మండలం 7.4 మీ.మీ, పెద్దముడియం 80.8, రాజుపాలెం మండలం 83.2, దువ్వూరు 34.6, చాపాడు 8.6 మీ.మీ., జమ్మలమడుగు మండలం 30.2 ముద్దనూరు 43.2, సింహాద్రిపురం 19.6, లింగాల 25.6, పులివెందుల 77.0, వేముల 15.0, తొండూరు 12.4, వీరపునాయునిపల్లె 60.2, వెంపల్లె 68.2, చక్రాయపేట మండలంలో 53.2 మీమీ వర్షపాతం నమోదైంది.

ఏబీసీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలి

పులివెందుల : రాష్ట్రంలో ఏబీసీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ నజీర్‌అహ్మద్‌ను ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏబీసీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించి మాదిగ ఉపకులాలకు ఏడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్లకు జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. పేద విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న అన్ని కులాల పేద విద్యార్థులకు ఉచిత ప్రమాదా బీమా ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కుటిల రాజకీయం

సీపీ బ్రౌన్ గ్రంథాలయం అదనపు కట్టడాల నిర్మాణాల విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు కాంట్రాక్టర్ సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయినా.. కార్మికులు స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకుంటూ స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా అవేమీ టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నించినందుకు వైఎస్ఆర్‌సీపీ డివిజన్ ఇన్‌ఛార్జ్‌పై పోలీసులచేత అక్రమంగా కేసు బనాయించారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి రూ. 6.66 కోట్ల నిధులను వైఎస్ జగన్ సర్కార్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. వైఎస్ఆర్‌సీపీ అభివృద్ధికి పాటుపడుతుంటే జీర్ణించుకోలేని కడప టీడీపీ నేతలు కుటిల రాజకీయం చేస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్: కడప నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఈ గ్రంథాలయం అభివృద్ధికి గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం అదనపు భవనాల నిర్మాణం సాగుతోంది. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. కడప టీడీపీ నేతలు నగరంలోని 21 డివిజన్ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్‌పై అక్రమంగా కేసును బనాయించి తమ అధికార బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రూ. 6.66 కోట్ల నిధులు మంజూరు..

సీపీ బ్రౌన్ గ్రంథాలయం విస్తరణ చేయాలని దివంగత జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు, గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్‌తో పాటు, అనేకమంది నాయకులు, అధికారులు, వైవీయూ అధికారులు వైఎస్ జగన్ సీఎంగా ఉండగా విన్నవించారు. ఆయన గ్రంథాలయ అభివృద్ధికి అదనపు భవనాల నిర్మాణానికి రూ. 6.66 కోట్లు నిధులను మంజూరు చేశారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయం ప్రాంతం విస్తరింపచేసేందుకు వెనుక భాగాన 0.27 సెంట్లు స్థలాన్ని రూ. 3 కోట్లతో సేకరణ చేశారు. భవన నిర్మాణాల అభివృద్ధి కోసం మరో రూ.3.66 నిధులను మంజూరు చేశారు. ఇందుకోసం వైఎస్ జగన్ తాను సీఎంగా వున్న సమయంలో సీపీ బ్రౌన్ గ్రంథాలయంను పరిశీలించి, ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ శిలాఫలకాన్ని దాచేశారు. ఈ విషయాన్ని స్థానికంగా 21వ డివిజన్‌కు సంబంధించిన వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు టీడీపీ నేతల పర్యటన సమయంలో ప్రశ్నించారు. దీంతో అతనిపై అక్కసును పెంచుకున్న టీడీపీ నేతలు సమయం కోసం ఎదురు చూశారు. కాగా ప్రస్తుతం స్థానికంగా సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద భవననిర్మాణ పనులను కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి చేయిస్తున్నారు. ఆయన ఈ భవన నిర్మాణ పనులను వేగవంతంగా చేసేందుకు నిర్మాణాల సమీపంలో షెడ్డును కార్మికుల కోసం ఏర్పాటు చేయించారు. దాదాపు 30 మంది కార్మికులు, తమ పిల్లలు, ఆడవాళ్లతో సహా అక్కడే నివాసం వుంటున్నారు. అంతేగాక స్థానిక బహిరంగ ప్రదేశాల్లోనే కాలకృత్యాలను తీర్చుకోవడం, స్నానాలను చేయడం వలన తీవ్రస్థాయిలో అపరిశుభ్రత నెలకొంది. భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి వసతులను కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి కల్పించకపోవడం వలనే ఈ విధంగా కార్మికులు వ్యవహరిస్తున్నారని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు స్థానిక కార్పొరేటర్ మోతుకూరు సుజాత, ప్రజలతో కలిసి వినతిపత్రం కూడా అందచేశారు. ఈ వ్యవహారంను పక్కదోవ పట్టించేలా కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి చేత రెండు రోజుల క్రితం టీడీపీ నేతలు 21వ డివిజన్ ఇన్‌ఛార్జ్ మోతుకూరు సుబ్బరాయుడు తమను రూ. 6 లక్షలను డిమాండ్ చేశారనీ, ఆ డబ్బులను ఇవ్వనందుకు స్థానిక ప్రజలను రెచ్చగొట్టి అనవసరమైన ఆరోపణలను చేయించి కడప ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు కూడా టీడీపీ నేతల సూచనల మేరకు సుబ్బరాయుడుపై అక్రమంగా కేసును ఆగమేఘాలమీద బనాయించేశారు.



కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయం భవనం



బహిరంగ స్నానాలను చేస్తూ నీళ్లను ఉపయోగించుకుంటున్న భవననిర్మాణ కార్మికులు (ఫైల్)



సీపీ బ్రౌన్ గ్రంథాలయం వెనుక భవననిర్మాణ కార్మికుల కోసం నిర్మించిన షెడ్డు, ఫిల్లర్లు

ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు



సీపీ బ్రౌన్ గ్రంథాలయం విస్తరణలో భాగంగా భవన నిర్మాణాలను చేపట్టడం ప్రజలందరికీ ఆమోదయోగ్యమే. భవన నిర్మాణాల కోసం వచ్చిన కార్మికులకు షెడ్డును మాత్రమే వేసి ఎలాంటి సౌకర్యాలను కార్మికులకు కాంట్రాక్టర్ కల్పించలేదు. వారు కాలకృత్యాలను, స్నానాలను బహిరంగంగా చేయడం వలన పిల్లలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల అభిప్రాయం మేరకు కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించాం.

– మోతుకూరు సుజాత, 21వ డివిజన్ కార్పొరేటర్, కడప

అక్రమ కేసును బనాయించారు.. న్యాయపోరాటం చేస్తాం



కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్య చర్యలను ప్రశ్నించినందుకు నాపై అక్రమ కేసును కడప ఒన్‌టౌన్‌లో పోలీసులచేత, టీడీపీ నేతలు బనాయించారు. ఈ అంశాన్ని ఇప్పటికే జిల్లా ప్రధాన న్యాయమూర్తికి, జిల్లా ఎస్పీకి, డీఎస్పీకి, కడప ఒన్‌టౌన్ పోలీసులకు వినతిపత్రం సమర్పించి సమస్యను వారి దృష్టికి తీసుకుని వెళ్లాం. న్యాయపోరాటం చేస్తాం. సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులకు సరైన సౌకర్యం కల్పించని కాంట్రాక్టర్ బాధ్యతా రాహిత్యం వలన కార్మికులు బహిరంగంగానే కాలకృత్యాలు, స్నానాలను చేస్తున్నారనీ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. వారు వచ్చి అపరిశుభ్రతపై ప్రశ్నించారు.

– మోతుకూరు సుబ్బరాయుడు, 21వ డివిజన్ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి